ఆ ఇద్దర్నీ చూసిన అతని ఆశ్చర్యం వెనుక అసలు కథ?

మణిపాత్రుని రామకృష్ణారావు కథ

# బంధం

మధ్యాహ్నం వరకూ మామూలుగా వున్న వాతావరణం బంగాళాఖాతంలో ఏర్పడ్డ డిప్రెషన్ కారణంగా హఠాత్తుగా మారిపోయింది.

నల్లటి మేఘాలు ఆకాశంలో పరుగులు తీస్తున్నాయి.

ఆఫీసునుంచొస్తుంటే స్కూటర్ ట్రబుల్ ఇవ్వటంతో షెడ్‌లో వదిలేసి బీచ్‌రోడ్డుమీదుగా ఇంటిమొహం పట్టాను.

చలిగాలి రివ్వున తాకుతూంది. ఎప్పుడూ కళకళలాడుతుండే రామకృష్ణా బీచ్ దాదాపు నిర్మానుష్యంగా వుందా సమయంలో. ఆ సంధ్య వెలుగులో ఒడ్డును తాకి విరుగుతున్న కెరటాలు సముద్రానికి తెల్లంచు దుప్పటి కప్పినట్లుగా కన్పిస్తున్నాయి. వడివడిగా నడుస్తున్నాను త్వరగా ఇల్లు చేరాలని.

“మాస్టారూ! బాగున్నారా?” ఎదురుగా వచ్చి నన్ను పలకరిస్తున్న వ్యక్తి ఎవరా అని ఆగి చూశాను.

“నేను మాస్టారూ! అప్పుడే మర్చిపోయారా మమ్మల్ని!”

ఆ! జ్ఞాపకం వచ్చింది. అతను — ఇందుమతి భర్త!

“ఓ! మీరా! పోల్చలేకపోయాను ఎలా వున్నారు?”

జవాబుగా శూన్యంలోకి చూస్తూ వుండిపోయాడు లిప్తకాలం

తేరుకుని—

“రండి మాస్టారు! మా యింటికెళ్దాం — ఇక్కడకు దగ్గర్లోనే” చేత్తో చూపాడు ఎంతో దూరంలేదని.

“లేదండీ — మరోసారొస్తాను...” ఆ



న్నాను వాచీ చూసుకుంటూ. వర్షం ప్రారం భం అయ్యేలా వుంది– ఈలోగా ఇల్లు చేరాలనే వుద్దేశ్యంతో.

"ఒక్కసారి వచ్చిపోదురుగాని – జస్ట్ ఫైవ్ మినిట్స్..." అభ్యర్థనగా చూశాడు నావైపు.

ఎందుకో మరి కాదనలేకపోయాను.

రామకృష్ణా బీచ్ ఎదురుగావున్న రోడ్డు

లోకి దారితీశాడాయన. నేను అతన్ననుసరిం చాను మౌనంగా.

''మేము గుర్తున్నామా మీకు మాస్టారు!' గేటు తీసుకుని లోనికి వెళ్తూ అడిగాడాయన.

ముందు చిన్న గేటువున్న బంగళా అది. ఆ ప్రదేశంలో ఇప్పుడిప్పుడే క్వార్టర్లు కడుతున్నారు. దూర దూరంగా వున్నాయి ఇళ్ళన్నీ. అంతా చీకటిగావుంది.

అతను గది తలుపులు తెరిచాడు. క్షణం తర్వాత అతని చేతుల్లోవున్న కొవ్వొత్తి వెలిగింది.

''లోపలికి రండి...'' అంటూ కొవ్వొత్తిని అక్కడున్న టీపాయ్ మీదుంచాడు.

''కరంటు లేదులా వుంది'' అనుకున్నాను మనసులో.

''కూర్చోండి. ఇప్పుడే వస్తాను...'' నన్ను ఆ హాల్లో వదిలి లోపలికి వెళ్ళాడు.

అక్కడున్న సోఫాలో కూర్చున్నాను.

కొవ్వొత్తి వెలుగు చిత్రంగా కదులుతూంది ఆ హాల్లోవున్న వస్తువులమీద.

చాలా రోజుల్నించి ఆ యింట్లో మనుషులు మసలుతున్నట్లుగా లేదు. అన్నీ కళావిహీనంగా కన్పించాయి నాకెందుకో!

సోఫామీద పేరుకుని వున్న దుమ్ము నా చేతులనిండా అంటుకున్నట్లుండటంతో కర్చీఫ్‌తో తుడుచుకున్నాను.

అప్పుడు చూశాను—

ఎదురుగా గోడకు వ్రేలాడుతోంది — ఇందూ, ఆమె భర్త కలిసివున్న ఫోటో ఒకటి.

''పాపం! ఇందుమతి! నా మనసు ఆమెపట్ల సానుభూతితో నిండిపోయింది.

ఆమె లేని లోటు స్పష్టంగా కన్పిస్తోంది ఆ యింట్లో.

తదేకంగా ఆమె ఫోటో వంకే చూస్తున్నాను.

ఇంతలో—

''కాఫీ తీసుకోండి...''

ప్రక్కకు చూశాను — నా వొళ్ళంతా గగుర్పాటు— నా కళ్ళను నేనే నమ్మలేకపోయాను—

ఆమె! ఇందూ! నాకెదురుగా చేతిలో కాఫీ కప్పుతో నిల్చుంది — చిన్నగా నవ్వుతూ నన్నే పలకరిస్తుంది!

నాకంతా అయోమయంగావుంది — నా అరచేతులు చిన్నగా చెమటతో తడిగా అయ్యాయి.

''తీసుకోండి మాస్టారు!'' ఆమె చేయి ముందుకుచాచి కప్పు అందిస్తోంది.

ఆ సన్నని వెల్తుర్లో ఆమె కళ్ళు వింతగా మెరుస్తున్నాయి.

''ఏంటి మాస్టారూ! అలా చూస్తున్నారు? ఇదిగోండి వేడి వేడి కాఫీ తాగండి''

తటాలున వెనక్కి చూశాను — అతను ఇందూ భర్త!

చుట్టూ చూశాను — ఆమె లేదు!

అతని చేతిలోంచి కప్పు అందుకుని ఒక్క గుటకలో తాగాను. నా చేయి వణుకు స్పష్టంగా తెలుస్తూంది కప్పును టీపాయ్ మీద పెడ్తున్నప్పుడు.

''వస్తాను!...'' ఒక్క వుదుటన అక్కడ్నించి వెలుపలికి వచ్చాను.

గేటుదాకా అతనొచ్చి సాగనంపుతున్నాడు.

"మిమ్మల్ని చూస్తే చాలా రిలీఫ్‌గా వుందండీ ఈరోజు — వస్తాండండి" గేటు దాటుతూంటే లోపల్నించి అంటున్నారెవరో — ఇందుమతి గొంతులా వుంది!

పరుగులాంటి నడకతో సందు తిరిగి రోడ్డుమీదకొచ్చాను. గాలి వర్షం ప్రారంభమైంది.

తడుచుకుంటూ ఇల్లు చేరాను. నాకంతా చిత్రంగా అనిపించింది. ఆ రాత్రంతా నాకు నిద్దరపట్టలేదు — ఆర్నెల్ల క్రితం జరిగిన సంఘటనలు ఒక్కొక్కటే గుర్తుకు రాసాగాయి.

***

ఆ వేళ—

స్టేషన్ చేరేసరికి మ్రెడాస్ మెయిల్ ప్లాట్‌ఫారం మీద సిద్ధంగావుంది రాజ శీవినొలకబోస్తూ.

గబగబా రిజర్వేషన్ కంపార్టుమెంటులో సీటు వెతుక్కుని కూర్చున్నాను కిటికీ ప్రక్కనే.

ట్రెయిన్ వాల్తేరు స్టేషనొదిలింది.

"ఎందాకా వెళ్తున్నారు మాస్టారు?" నాకెదురుగా కూర్చున్న ముసలాయనడిగాడు నన్ను.

"మద్రాసు..." కిటికీలోంచి చూస్తూ చెప్పాను.

"మేమూ అక్కడకే బాబూ!" అడక్కుండానే చెప్పాడాయన.


"ఓహో! అలాగా!" వెనక్కి పరిగెడ్తున్న దృశ్యాల్ని చూస్తూ అన్నాను.

మెయిల్ అనకాపల్లి స్టేషను దాటింది.

"మద్రాసులో వుద్యోగం చేస్తున్నారా?" మరల అడిగాడాయన.

"లేదు — కంపెనీ పనిమీద వెళ్తున్నాను' ' ముక్తసరిగా చెప్పి నా ఆలోచనలో నేను పడ్డాను.

"మాదీ విశాఖపట్నమే బాబూ! ఆసుపత్రి పనిమీద వెళ్తున్నాం — అదిగో — మా అమ్మాయి, అల్లుడూ అంటూ అటు



ప్రక్కసీట్లలోవున్న వాళ్ళని చూపించాడు.

"ఎవరికి బాగోలేదు?" మరీ ముభావం గా వుంటే బాగోదని అడిగాను.

"మా అమ్మాయికి బాబూ! ఇక్కడ చూపిస్తే మద్రాసు తీసుకుని వెళ్ళమన్నారు. .." అంటూ లాల్చీ జేబులోంచి కాగితాలు తీసి నాకిచ్చాడు చూడమన్నట్లుగా.

మద్రాస్‌లోవున్న కేన్సర్ ఇన్‌స్టిట్యూట్ కి రెఫర్ చేస్తూ డాక్టరు చీటీలు, ఇతర వివరాలు వున్నాయందులో.

"మొన్ననే బాబూ రెండు నెల్లయింది వాళ్ళకి వివాహమై — ఇంతలో ఈ కష్టమొచ్చింది..." ఆ ముసలాయన ముఖం క్షణంసేపు వివర్ణమైంది. కిటికీలోంచి చూ స్తూ కళ్ళు తుడుచుకుంటున్నాడు.

నేను వాళ్ళిద్దరి వంకా చూశాను — ఆమెకు ఇరవైయ్యేళ్ళు లోపేవుంటుంది. సన్నగా పొడవుగా వుంది. విశాలమైన కళ్ళు, ఇప్పుడిప్పుడే మొహం కాంతిని కోల్పోతున్న ట్లు కన్పించింది — గ్రహణం ప్రారంభంలో తగ్గుతున్న వెన్నెలలా.

పాపం! అనిపించింది ఆ జంటను చూస్తోంటే. వైవాహిక జీవితం ఆనందంగా గడపాలని ఎన్ని కలలు కన్నారో...

నా మనసంతా చేదుగా మారింది.

ఆ యిద్దర్నీ అలా చూస్తూ వుండిపో యాను.

గోదావరి దాటుతోంది రైలు పెద్దగా శబ్దం చేస్తూ.

అస్తమిస్తున్న సూర్యుడు గోదావరిలో ఎర్రగా సాగి చిందవందరవుతున్నాడు అలల తాకిడికి.

ఆమెకు కిటికీలోంచి దూరంగా చూపు తూ ఏదో వివరిస్తున్నాడామె భర్త.

ఆమెను సాధ్యమైనంత సంతోషంగా వుంచాలనే తాపత్రయం కన్పిస్తుందతనిలో.

విజయవాడ స్టేషన్లో ఆమెను ఏదైనా తినమని బతిమాలుతున్నారు భర్త, తండ్రీ ను. ఆకలిగా లేదంటుందామె!

మరి కాస్సేపటికి ఆమె నిద్రపోయింది. రాత్రంతా ఆమెను చూస్తూ భర్త మేలుకుని వుండటం గమనించాను.

నాకూ సరిగా నిదురపట్టలేదు.

మద్రాసు సెంట్రల్‌లో దిగిపోయాము అందరమూ.

వాళ్ళు వెళ్లవలసిన హాస్పిటల్ ఎక్కడ వున్నదీ, ఎక్కడ బస చేస్తే బాగుంటుందో మొదలైన వివరాలు చెప్పాను.

సేల్సు ఎగ్జిక్యూటివ్‌గా తరచూ రావటం మూలాన మద్రాసు నగరంతో కాస్త పరిచ యమయింది నాకు.

వాళ్ళు ముగ్గురూ టాక్సీ ఎక్కారు థాంక్స్ చెబుతూ.

"వీలుంటే ఒకసారి హాస్పిటల్‌కు రండి'.

టాక్సీ కదులుతుంటే ఆమె భర్త అన్నాడు.

* * *

రెండు రోజుల తర్వాత ఒక సాయంత్రం హోటల్‌కి వచ్చి డ్రెస్ ఛేంజిచేసుకుంటుం టే ట్రయిన్‌లో కలిసిన వాళ్ళు జ్ఞాపకం వచ్చారు.

ఆమెకెలా వుందో చూసి రావాలనిపించిం ది.

హాస్పిటల్‌కి వెళ్ళాను. వాళ్ళ పేర్లు తెలియవు — అంతపెద్ద హాస్పిటల్‌లో వాళ్లెక్కడవున్నదీ తెలుసుకోలేకపోయాను.

పోదామని వెనుదిరిగాను.

ఇంతలో ఆ ముసలాయన గేటుదాటి వస్తున్నాడు.

"ఎలా వుంది మీ అమ్మాయికి? చూద్దామని వచ్చాను" అన్నాను ఆయనకు ఎదురు వెళ్ళి.

"బాబూ! మీరా?" నా చేయి పట్టుకున్నాడు. ఆ కొత్త ప్రదేశంలో ఆప్తుడ్ని చూసినట్లనిపించిందేమో నన్ను చూడగానే.

వార్డులోకి తీసుకువి వెళ్ళాడు నన్నాయన ఆమె బెడ్‌మీదుంది.

మనిషి తెల్లగా పాలిపోయి చాలా వీక్‌గా వుంది. నన్ను పోల్చినట్లుగా చూసింది.

భర్త ఆమె ప్రక్కనే కూచునివున్నాడు. దిగులుగావున్నాడు. మాసిన బట్టలూ — గడ్డం పెరిగి చాలా డీలా అయిపోయాడు.

నన్ను చూసి ప్రక్కకు తిరిగి కళ్ళు తుడుచుకుంటున్నాడు.

"డాక్టర్లు ఏమన్నారు?" ముసలాయన్ను ప్రక్కకు పిలిచి ఆత్రుతగా అడిగాను.

"ఆపరేషను చేశారు — రెండ్రోజులైంది — వారి ప్రయత్నాలేవో వాళ్ళు చేస్తున్నారు బాబూ!" అంతకంటే గొంతు పెగల్లేదాయనకు.

"నా సహాయం ఏదైనా కావలిస్తే చెప్పండి" ఆ స్థితిలో వాళ్ళకు వేవెలాగైనా సాయపడితే బాగున్ననిపించింది.

"అబ్బాయిని చూస్తే కడుపు తరుక్కుపోతూంది బాబూ! భార్య మంచందగ్గరనుంచి కదలటంలేదు — నిద్రాహారాలు లేవు — భార్యను చూస్తూ కూచోటం — చిన్న పిల్లాడిలా ఏడ్వటం — ఏం చేయాలో తోచటం లేదు!" అతను అలా చెప్తుంటే నాకు చాలా జాలివేసింది.

"మావయ్యగారుంటారు— రండి బయటకెళ్దాం" పిలిచానతన్ని కాస్త ధైర్యం చెబుదామన్న వుద్దేశ్యంతో.

నావంక బేలగా చూసి లేచాడతను భార్య బెడ్‌మీదనుంచి.

ఆమెను చూస్తూ నా వెంట నడిచాడు వెలుపలకు.

దగ్గర్లోవున్న కేంటీనుకు తీసుకువెళ్ళానతన్ని.

"చూడండి — మీరలా అధైర్యపడితే ఎలా! ఇలాంటి సమయాల్లోనే గుండె దిటవు చేసుకోవాలి" అంతకంటే అతన్ని ఓదార్చటం నాకు చేతకాలేదు.

టేబిల్‌మీద తలవాల్చి ఏడుస్తున్నాడతను.



## సలహా

"ఇంటర్వ్యూ కెళ్లేప్పుడు ఏవేవి తీసుకెళ్లాలి సార్" తొలిసారి ఇంటర్వ్యూకు వెళ్తున్న మురళి అడిగాడు.

"డెత్ సర్టిఫికెట్ తప్ప మిగతావన్నీ!" ఇంటర్వ్యూలతో విసిగిపోయిన ఆనంద్ చెప్పాడు.

—యు.సదాశివరావు (గాంధీనగర్ మోరి)

''కాఫీ తీసుకోండి...'' సర్వరు తెచ్చిన కాఫీనతనికి అందించాను.

''నా ఇందుమతి చనిపోతే నా బ్రతుకంతా శూన్యం సార్! మీకు తెలియదు కదూ! ఇద్దరం ప్రేమించి పెళ్ళి చేసుకున్నాం — ఆమె లేనిదే నేను జీవించలేనండీ — నా ఇందూ మరల మామూలు మనిషవుతుందంటారా?'' ఆశ, నిరాశలమధ్య నలిగిపోతున్నాడతను.

నేను మరేం మాట్లాడలేకపోయాను. కాస్సేపుండి హోటల్‌కి వచ్చేశాను.

ఆ మర్నాడు—

వచ్చిన పని పూర్తయేసరికి సాయంత్రం అయింది. హోటల్ ఖాళీ చేసి హాస్పటల్‌కి వెళ్ళాను — ఒకసారి చూసిపోదామని.

వార్డులో ఆమె బెడ్ ఖాళీగావుంది. ఆమె భర్త, తండ్రి కన్పించలేదు.

ఎంక్వయిరీలో అడిగాను—

ఆ తెల్లవారు జామున ఆమె చనిపోయిందని చెప్పారు.

నా మనసు బాధతో సుళ్ళు తిరిగింది. ఆమె మరణం చాలా రోజులవరకూ మర్చిపోలేకపోయాను. జ్ఞాపకం వచ్చినప్పుడల్లా మనసులో ముల్లు విరిగినట్లు వుండేది—

కాని ఈ వేళ — ఇందూ ఇలా కన్పించటం వింతగావుంది — పదే పదే ఆమె రూపం కళ్ళముందు మెదులుతూ వుంది. కాలంతో బాటుగా మరుగవుతున్న విషాదం నన్ను మరలా కదిలించింది.

ఏదో అనుమానం మనసులో పీకుతోంది! ఒక విధమైన క్యూరియాసిటీ — మరల ఆ ఇంటికి ఒకసారి వెళ్దామని!

ప్రొద్దుటే వెళ్ళాను అతన్ని కలుద్దామని గేటు తాళం వేసుంది. బహుశా బ్రేక్‌ఫాస్ట్‌కని దగ్గర్లో ఏదైనా హోటల్‌కి వెళ్ళుంటాడనుకుని ఆ యింటి దగ్గర్లో నిల్చున్నాను.

అరగంట గడిచింది — అతను రాలేదు.

మరో అరగంట వేచి చూశాను వస్తాడేమోనని. అతని గురించి వాకబు చేయటానికి ఇరుగుపొరుగున ఇళ్ళేవీలేవు. వందగజాల దూరంలోవున్న సందు మలుపులో చిన్న కిళ్ళీ దుకాణం, దానినానుకుని టీస్టాల్ వున్నాయి.

''ఆ ఇంట్లో వుండే ఆయన ఎక్కడ కెళ్ళారు?'' ఇంటివైపు చేయి చూపుతూ అడిగావక్కడున్న ఒకాయన్ను.

''ఎవరూ!?'' అడిగాడతను నన్ను ఆపాదమస్తకం పరిశీలిస్తూ.

''అదిగో ... ఆ ఇంట్లో వుంటున్నారే అతను — తాళం వేసుంది'' మరలా చెప్పాను ఆ యింటివైపు చూపుతూ.

''మూర్తిబాబు సంగతేనా మీరడిగేది — మీకు తెలియదా? భార్య మద్రాసులో చనిపోయింది — పాపం — ఆ దుఃఖం భరించలేక ఆ బాబేమో ఇక్కడకొచ్చిన మర్నాడే ఆ ఇంట్లోనే వురిపోసుకుని చనిపోయాడు — వాళ్ళ బంధువులెవరో తాళాలు వేసుకుని పోయారు — చాలా రోజులైంది — ఇంతకూ మీరెవరు? ఏం కావాలి?

నాకాళ్ళ క్రింద భూమి ఒక్కసారిగా కంపించినట్లయింది — ఆ వణుకు నా నరాల్లోకి ప్రాకి వళ్ళంతా చిన్నగా వూగుతోంది!

''అదేంటి — నిన్నతను నాకు కన్పించాడు...'' అందామనుకున్నాను ... కాని

గొంతు పెగల్లేదు.

"ఏ వూరుమీది...?" ఇంకేవో ప్రశ్నలు వేస్తున్నాడా వ్యక్తి.

నేను జవాబు చెప్పే స్థితిలోలేను.

ఆ షాక్‌నుంచి తేరుకుని వడివడిగా రోడ్డుమీదకొచ్చాను. నా గుండె కొట్టుకునే వడి చెవుల్లోంచి స్పష్టంగా వినిపిస్తోంది. మరి నడవలేక అటుగా పోతువ్న ఆటోను పిలిచి అందులో కూలబడ్డాను.

"వాళ్ళ ప్రేమ ఎంత గొప్పదో లోకానికి చాటాలని కాబోలు నన్నిలా సాక్షిని చేశారు వాళ్ళిద్దరూ..." గొణుక్కున్నాను నాలో నేను.

*

